క్లుప్తంగా

వ్యక్తిగత క్రమశిక్షణ పెంపొందాలి

తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్



తిరువూరు: విద్యార్థులు చిన్నతనం నుంచి వ్యక్తిగత క్రమశిక్షణ అలవరచుకోవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. లయన్స్ క్లబ్, వేగ్నేశ ఫౌండేషన్ల సహకారంతో ఎ. కొండూరు కస్తూరిబా బాలికా విద్యాలయంలో ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్‌ను జడ్జి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, పత్రికా పఠనం అలవరచుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరావు, సభ్యులు సంకురాత్రి జనార్దన్, కంచర్ల ముత్యప్రసాద్, నాగుబండి ప్రకాశరావు, నాగుబండి విశ్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు శిక్షణ



ఇబ్రహీంపట్నం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన అంశంపై ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్‌ఐఆర్డీ డైరెక్టర్ వరప్రసాద్, ఎంపీడీఓ సునీతశర్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని సక్రమంగా అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.
పేదరికం లేని మెరుగైన సమాజం, మెరుగైన ఆరోగ్యం, సమృద్ధిగా నీరు, పచ్చదనం పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన, మహిళాభ్యుదయం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈటీపీఆర్డీ మనోజ్ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు.

నూతన కమిటీ ఎన్నిక



ఇబ్రహీంపట్నం: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు ఎం.మహేష్, ఆలేటి విఠల్‌రావు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో మదర్ థెరిస్సా ఆటో డ్రైవర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. వారు మాట్లాడుతూ ఆటో వర్కర్లు ప్రజా రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. డిగ్రీలు చదువుకున్న వారు కూడా ఉపాధి కోసం ఆటో డ్రైవర్లుగా మారారని చెప్పారు. వీరి జీవనోపాధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన పాలకవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎం.మహేష్, అధ్యక్షుడిగా ఆర్.చంటి, కార్యదర్శిగా షేక్ నాగుల్‌మీరా, కోశాధికారిగా ఎం.అజయ్‌తోపాటు మరో ఆరుగురు సభ్యులు ఎన్నికయ్యారు.

జాతీయ స్కిప్పింగ్ పోటీలకు జెడ్పీ విద్యార్థులు



ఇబ్రహీంపట్నం: జాతీయ స్కిప్పింగ్ (జంప్ రోప్) పోటీలకు ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీల్లో సీహెచ్ రాజ్ వెంకటేశ్వరి గోల్డ్‌మెడల్, ఎం.తులసి సిల్వర్, బి.బిందు బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు.
త్వరలో రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. సైక్లింగ్‌లో కూడా ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చూపి సర్టిఫికెట్లు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీడీ దీప పాల్గొన్నారు.

సొంతవారి కోసం చిరుద్యోగుల తొలగింపు

ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. లేకుంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబుతోపాటు కూటమి నేతలు ఎన్నికల్లో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల కల్పన వదిలేసి ఆ పార్టీ నాయకులు చిరుద్యోగులను తొలగించడమే పనిగా పెట్టుకున్నారు. ఆ స్థానంలో టీడీపీ సానుభూతి పరులను నియమించుకుంటున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను తొలగించి టీడీపీ సానుభూతి పరులను నియమించుకుంటున్నారు. దీనికి అధికారులు సైతం వత్తాసు పలకడం గమనార్హం. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ఆరు నెలల్లో 25 మంది ఇంటికి
- వారి స్థానంలో టీడీపీ సానుభూతిపరుల నియామకం
- వివిధ కారణాలు చూపి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల తొలగింపు
- ఎస్ఎంసీలు ఏర్పాటైన నాటి నుంచి మరింత పెరిగిన ఒత్తిడి



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: తమ ఇంట్లో పనిచేసే వర్కర్లను తొలగించిన మాదిరిగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తూ ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులను అధికారులతో తొలగింపజేస్తున్నారు. నేరుగా పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈఓలే అధికార పార్టీ నాయకుల మాటలు వింటూ స్వచ్ఛందంగా తప్పుకోండంటూ మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఒత్తిడి తీసుకురావడం గమనార్హం. అధికారుల తీరును చూసి అధికారులా...రాజకీయ పార్టీ ఏజెంట్లా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చాట్రాయి మండలం పోలవరం హైస్కూల్‌లో 2003 నుంచి పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులను తొలగించారు. ఏరోజూ భోజనం బాగోలేదని గాని, విద్యార్థులకు సరిగా పెట్టడం లేదని గాని ఆ నిర్వాహకురాలిపై ఫిర్యాదులు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎంఈఓ, హైస్కూల్ హెచ్ఎంలపై ఒత్తిడి తీసుకువచ్చి ఆ ఏజెన్సీ నిర్వాహకురాలు మానేసేలా చేశారు. ఆ స్థానంలో వేరొకరిని నియమించారు. కోటపాడు ప్రాథమిక పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ వంట ఏజెన్సీ నిర్వాహకులను తొలగించి రెండు నెలల కిందట కొత్త వ్యక్తిని నియమించారు. ఈ కొత్త వ్యక్తి ఇటీవల చేసిన బంగాళదుంప కుర్మా తిని తొమ్మిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం తెలిసిందే. తాజాగా ఆ వ్యక్తిని కూడా తొలగించేసి మరో వ్యక్తిని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులుగా అధికారులు నియమించారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నాయి. ఎస్ఎంసీ కమిటీలు ఏర్పాటైన నాటి నుంచి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులపై మరింత ఒత్తిడి పెరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తూ తొలగించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలిని తొలగించేందుకు టీడీపీ నాయకులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటి వరకు నూజివీడు నియోజకవర్గంలో 25 మందిని తొలగించి వారి స్థానంలో టీడీపీ సానుభూతి పరులను నియమించుకున్నారు.

మండలం	మొత్తం భోజన ఏజెన్సీలు	తొలగించిన ఏజెన్సీలు
నూజివీడు	92	06
చాట్రాయి	63	13
ముసునూరు	61	03
ఆగిరిపల్లి	50	03
మొత్తం	266	25

ఎన్నో ఏళ్లుగా పనిచేసినా తొలగించారు



పోలవరం హైస్కూల్‌లో 2003 నుంచి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తున్నా. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒత్తిడి చేసి మానేసేలా చేశారు. ఎంఈఓ, హెచ్ఎంలతో సైతం ఒత్తిడి చేయించారు. దీంతో చేసేదేమీ లేక మానేశాం.

– పసుపులేటి లక్ష్మి, పోలవరం, చాట్రాయి మండలం

ఆగస్టు నుంచి తొలగించారు



చిన్నంపేట ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని 2003 నుంచి నిర్వహిస్తునా. ఏ నాడూ రిమార్కులు లేవు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారికి చెందిన వారిని నియమించుకునేందుకు ప్రతిరోజూ నాపై ఒత్తిడి చేశారు. స్కూల్ మాస్టారుతో సైతం స్కూల్‌కు రావద్దని చెప్పించారు. ఆగస్టు నుంచి అకారణంగా నన్ను తొలగించేశారు.

– కలపాల సుమలత, చిన్నంపేట, చాట్రాయి మండలం

రెవెన్యూ సదస్సులకు అర్జీలు

మైలవరం: రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు గ్రామంలో సర్పంచ్ నూనె అప్పిరెడ్డి అధ్యక్షతన మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 18 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సుశీలాదేవి తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలకు 5, సర్వే కోసం 5 అర్జీలు, కుల ధ్రువీకరణ పత్రం కోసం రెండు అర్జీలు వచ్చాయని చెప్పారు. దీనిలో సర్వే అర్జీలు 4, కుల ధ్రువీకరణ పత్రాలు రెండు రెవెన్యూ సదస్సులోనే తహసీల్దార్ సర్వే చేయించి పరిష్కరించారు. సదస్సులో ఎంపీటీసీ నూనె రమాదేవి, పిడపర్తి రామిరెడ్డి, పాములపాటి సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** రైతుల భూ సమస్యలను పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. తోటపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే రీ సర్వే చేసి పరిష్కరిస్తామన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. డెప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఆర్ఐ యూనస్, మండల సర్వేయర్ గంగరాజు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డి. ప్రశాంతి అన్నారు. మండలంలోని ముంకొల్లు, చిన్నంపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రకాల సమస్యలపై 8 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వైఎస్సార్ సీపీ నేతల విరాళం



తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైకిల్ షెడ్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకుడు కాలసాని గోపాల నాగేశ్వరరావులు విరాళాన్ని ప్రధానోపాధ్యాయిని శ్రీలక్ష్మికి అందజేశారు.

వృద్ధాప్యం అనుభవాలతో కూడిన గ్రంథం

ఆర్డీఓ మోవిడివాణి

నూజివీడు: వృద్ధాప్యం అనుభవాలతో కూడిన గ్రంథమని, భవిష్యత్ తరాలు పెద్దల అనుభవ సారాన్ని వినియోగించుకోవాలని ఆర్డీఓ మోవిడి వాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 42వ అఖిల భారత పెన్షనర్స్ డే వేడుకలను పట్టణంలోని సమతా నగర్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్డీఓ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కన్నబిడ్డలపై ఉందన్నారు. తల్లిదండ్రులను భారంగా భావించి బాధపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూజివీడు అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ముప్పాళ్ల పల్లవి, టౌన్ సీఐ శ్రీనివాస్, పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు బండారు సత్యనారాయణ, పి. పిచ్చయ్య, మాధవరావు, వేల్పుల స్టాలిన్ ప్రభాకర్, కేజేడీ రిచర్డ్, ఏయూఎం దిలీప్, శారదా దేవి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

విస్సన్నపేట: జాతీయ పెన్షనర్ల దినోత్సవం విస్సన్నపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ఖజానాధికారి ఎండీ హర్షద్ ఉమర్ ముఖ్య అతిథిగా పాల్గొని రిటైర్డు ఉద్యోగులకు ప్రభుత్వపరంగా లభిస్తున్న సదుపాయాలను వివరించారు. పెన్షనర్లు సక్రమంగా పెన్షన్ పొందడానికి విధిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. ఎస్టీఓను, సీనియర్ పెన్షనర్ ధనరాజును సంఘ సభ్యులు సత్కరించారు. రిటైర్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నల్లంటి సూరిరాజు, సభ్యులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్డీఓ మోవిడి వాణి

పింఛన్ ప్రతి ఉద్యోగి హక్కు

నూజివీడు: గతంలో చేసిన సేవలకు చెల్లింపే పింఛన్ అని, ఇది ప్రతి ఉద్యోగి హక్కు అని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు వంగల గోవిందరావు అన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో జాతీయ పెన్షనర్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ఖజానాధికారి పల్లవి మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల రక్షణకు అసోసియేషన్లు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న 14 మంది విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, కార్యదర్శి సోమయాజులు, కోశాధికారి ప్రకాశరావు పాల్గొన్నారు.



విస్సన్నపేట ఎస్టీఓను సన్మానిస్తున్న సభ్యులు

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ



ఇంధన పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న సీఈ బి.శ్రీధర్ తదితరులు

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారానే భావితరాలకు భవిష్యత్ ఉంటుందని ఏపీ జెన్‌కో శిక్షణ సంస్థ చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. విద్యుత్ పొదుపు మనం పాటించడంతో పాటు మన కుటుంబ సభ్యులు, చిన్నారులకు కూడా అలవాటు చేయాలన్నారు. ఎన్టీటీపీఎస్ సీఈ నాగరాజు ఇంధన పొదుపుపై కరపత్రాలు ఆవిష్కరించారు. ఆధునిక యుగంలో విద్యుత్ నిత్యావసరంగా మారిందన్నారు. విద్యుత్ పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఎస్ఈలు సుశీల, ప్రసాద్, అనురాధ, జీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగులో మెలకువలు పాటించాలి

ఎర్రమాడు(తిరువూరురూరల్): దాళ్వా వరి సాగు చేసేటప్పుడు రైతులు మెలకువలు పాటించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. ఎర్రమాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరిలో నారుమడి తయారు చేసే విధానాన్ని బట్టి ఆరోగ్యవంతమైన నారు పెరుగుతుందన్నారు. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, కిలో పొటాషియం కలిపి ఎరువులను దుక్కిలో వేయాలని, జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున లేదా క్లోరోపైరిఫాస్ రెండు మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి విత్తిన పది రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలని చెప్పారు. పెద్దవరం సర్పంచి అప్పారావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నూజివీడు: మండలంలోని బోర్వంచ, యనమదలలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి ఆర్. హేమ మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మామిడి తోటల్లో పూత రావడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు, జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు, వేప నూనె 1500 పీపీఎం మూడు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మామిడికి బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువును ఈనెల 31 వరకు పొడిగించారని చెప్పారు. వీహెచ్ఏ దుర్గాబాయి, రైతులు పాల్గొన్నారు.



యనమదలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హేమ

యువకుడికి అస్వస్థత

వామకుంట్ల(తిరువూరు): వామకుంట్లలో ఓ యువకుడు మంగళవారం పురుగుమందులో మద్యం కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. మలమంటి దానియేలు (30) ఇంటిలోని కలుపు మందు డబ్బాలో మద్యం కలుపుకుని తాగి అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దానియేలుకు భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడకు తరలించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ముందడుగు వేసేందుకు అందరి అండ, ఆదరణ అవసరమని హెచ్ఎం బి.సురేష్ అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ అభ్యసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు వైద్య పరీక్షలు

తిరువూరు: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా తిరువూరులోని బాపూజీ పెన్షనర్స్ హోంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ మ్యాక్స్ విజన్ వైద్యులు నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బల్లిపర ప్రసాదరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ బ్రహ్మాచారి పేర్కొన్నారు. మండలంలోని గంటిపాడు తండాలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు కార్గో కార్యాలయం తనిఖీ

నూజివీడు: ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆర్టీసీ కార్గో మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. నూజివీడు బస్టాండులోని కార్గో కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో నాలుగు డిపోలు, ఏలూరు జిల్లాలో మూడు డిపోలున్నాయని, వీటి పరిధిలో ఆర్టీసీకి కార్గో ఆదాయాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. దీనికి గాను ఈ నెల 20 నుంచి వచ్చే నెల 19 వరకు డోర్ డెలివరీపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా నూజివీడు బస్టాండు నుంచి 10 కి.మీ. వరకు ఉచితంగా డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నూజివీడు డిపోకు సంబంధించి కార్గో ఆదాయం రూ.40 లక్షలు వచ్చిందన్నారు. పండ్లు, కూరగాయల వ్యాపారులకు కావాలంటే డిక్కీ బుకింగ్ కూడా చేస్తామని చెప్పారు. ఆర్టీసీ పార్సిల్ సర్వీసు ద్వారా వేగంగా తమ పార్శిళ్లను బంధువులకు, మిత్రులకు పంపుకోవచ్చన్నారు. ఆగిరిపల్లిలో ఒక పాయింట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి కార్గో ఆదాయాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.నూజివీడు డిపో సీఐ జి.రాంబాబు పాల్గొన్నారు.



కార్గో పాయింట్‌ను తనిఖీ చేస్తున్న కార్గో మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో మంగళవారం విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లులు పెంచేది లేదని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేశారన్నారు. ఈ ఆరు నెలల్లోనే దాదాపు రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన మోపిన చంద్రబాబుకు ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. హామీలను విస్మరించడం, మాట మార్చడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచిందని దుయ్యబట్టారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు నండూరి పద్మాంజలి, కొలికపోగు లెనిన్, శోభనాద్రి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ప్రశాంతంగా డీసీ కమిటీల ఎన్నిక

మైలవరం: నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. కోడూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్‌గా మైలవరం మండలం తోలుకోడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఇనుగంటి శోభన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా వెల్లటూరు గ్రామానికి చెందిన ఎలిసిల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైలవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన ఉమ్మడి వెంకటస్వామి, వైస్ చైర్మన్‌గా గడ్డమణుగు గ్రామానికి చెందిన బొబ్బూరి వెంకట్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- **ముసునూరు:** ముసునూరు మండల నాగార్జున సాగర్ సాగునీటి పారుదల కమిటీ అధ్యక్షుడిగా కాట్రేనిపాడుకు చెందిన రాపర్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా లోపూడికి చెందిన చలమాల వెంకటేశ్వరరావు, సభ్యులుగా లక్ష్మణరావు, కొల్లి గంగారామ్, సుగసాని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

21 లీటర్ల సారా స్వాధీనం

ముసునూరు: సారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో మెరుపుదాడి చేసి ఇద్దరిని ఏలూరు స్పెషల్ స్క్వాడ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశామని నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. మంగళవారం చిల్లబోయినపల్లిలో పామర్తి శేఖర్‌కు చెందిన సారా బట్టీపై దాడి చేశారు. దాడిలో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక లీటరు సారా స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన జోగి శ్రీనివాసరావు వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. అక్రమంగా మద్యం, సారా విక్రయాలు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని మస్తానయ్య హెచ్చరించారు.

రైల్వే ట్రాక్ భూముల పరిశీలన

బూదవాడ: గ్రామంలోని రైల్వే ట్రాక్ భూములను నందిగామ ఆర్డీవో బాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం గ్రామంలో రైల్వే ట్రాక్ ఏర్పాటుకు కొందరు రైతులు 7.53 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అందించలేదని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబూరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఆర్ఐ సూరమ్మ, సర్వేయర్ అనూష్‌బాబు, వీఆర్వో పాల్గొన్నారు.